## కాంటాపురి

# నేపథ్యం, ఉద్యమం, నిర్బంధం

పశ్చిమ బెంగాల్ చిత్రపటం మీరు చూసే ఉంటారు. పెద్ద పొట్ట, సన్నటి మెడ, ఒక మోస్తరు తలకాయ ఉన్న మృగంలాగ ఉంటుంది. ఆ మెడ మధ్య భాగంలో అడ్డంగా గంగానది ప్రవహిస్తుంది. నదికి ఉత్తర భాగాన ఉన్న ప్రాంతాన్ని 'ఉత్తర బెంగాల్' అంటారు. అందులో ఆరు జిల్లాలున్నాయి. డార్జిలింగ్, జల్పాయ్‌గుడి, కూచ్-బిహార్, మాల్దా, ఉత్తర దినాజ్‌పూర్, దక్షిణ దినాజ్‌పూర్.

డార్జిలింగ్ జిల్లాలోని కొండ ప్రాంతాలలో నివసించే నేపాలీలు తమకొక ప్రత్యేక రాష్ట్రం (గూర్ఖా లాండ్) కావాలంటూ ఆయుధాలు పట్టుకొని కొంతకాలం ఉద్యమించి కొంత స్వయం ప్రతిపత్తిని సాధించుకున్న సంగతి తెలిసిందే.

తక్కిన అయిదు ఉత్తర బెంగాల్ జిల్లాలలోనూ డార్జిలింగ్ జిల్లాలోని మైదాన ప్రాంతాలలోనూ ఒక దశాబ్దం కాలంగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమమొకటి నడుస్తున్నది. దానిని 'కాంటాపురి' ఉద్యమం అని పిలుస్తున్నారు. ('కామ్టాపురి' అని పలకాలి) ఆ ఉద్యమకారులు కోరుకుంటున్న ప్రత్యేక రాష్ట్రం పేరు 'కాంటాపూర్'. ఆ ఉద్యమం తరపున కాంటాపూర్ పీపుల్స్ పార్టీ (కెపిపి) అనే పార్టీ ఒకటి ఉంది. ఆ పార్టీ గత పంచాయతీ ఎన్నికలలో పాల్గొని 27 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ పదవి గెలుచుకునింది. అసెంబ్లీ ఎన్నికలలో జల్పాయ్‌గుడి జిల్లాలో ఒక సీటుకు పోటీచేసి ఓడిపోయింది కూడా.

కెపిపియే కాక, అఖిల కాంటాపురీ విద్యార్థి సంఘం (ఎకెఎస్‌యు - 'ఆక్సు') కాంటాపురీ స్త్రీల హక్కుల సంఘం (కెడబ్ల్యుఆర్ఏ) అనే ప్రజా సంఘాలు కూడా ఈ ఉద్యమానికి ఉన్నాయి. వాటితో పాటు కాంటాపురి విమోచన సంస్థ (కెఎల్ఓ) అనే అండర్‌గ్రౌండ్ సాయుధ సంస్థ కూడా ఉంది.

ఈ కెఎల్ఓ పెద్దఎత్తున హింసకు పాల్పడిన దాఖలాలేవీ లేవుగానీ కాంటాపురీ ఉద్యమం ఏ చర్యకు పాల్పడినా దానిని కెఎల్ఓతో ముడిపెట్టి విరుచుకుపడడం పశ్చిమ బెంగాల్ పోలీసులకూ వారికి అండగా ఉత్తర బెంగాల్‌లో మోహరించిన కేంద్ర పారామిలిటరీ బలగాలకూ పరిపాటి అయింది.

పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష సంఘటన అధికారంలో ఉండడం వల్ల ఏ తేడా రాలేదా అంటే ఒక్క తేడా మాత్రం ఉంది. కాంటాపురీ ఉద్యమం మీద 'పోటా' ప్రయోగించడం లేదు. అయితే 'పోటా' ప్రయోగించడం వల్ల ప్రభుత్వానికి ఉండగల ఒక ప్రయోజనాన్ని (బెయిలు రాకుండ దీర్ఘ కాలం రిమాండులో ఉంచే సదుపాయాన్ని) మాత్రం అన్యమార్గాల ద్వారా పశ్చిమ బెంగాల్ పోలీసులు సాధించుకుంటున్నారు.

ఈ నిర్బంధం వివరాలలోకి పోయేముందు కాంటాపురీ ఉద్యమం చారిత్రక, సామాజిక పూర్వాపరాలను తెలుసుకోవడం ఉచితంగా ఉంటుంది.

## చరిత్ర

ఈ ఉద్యమానికి పునాది రాజ్‌బన్షి (రాజవంశి అని చదువుకుంటే మనకు సులభంగా ఉంటుంది) అనే కులం. వీళ్లు పశ్చిమ బెంగాల్‌లో షెడ్యూల్డు కులం, అస్సాంలో వెనుకబడిన కులం, త్రిపురలో షెడ్యూల్డు తెగ! మన సమాజంలో ఆదివాసీ తెగ నుంచి కులానికి కొంత పరివర్తన చెంది ఇంకా పూర్తిగా చెందకుండ ఉండిపోయిన ప్రజా సమూహాలు ఉన్నాయి. అటువంటి సమూహాలలో ఒకటిగా రాజ్‌బన్షిలను అర్థం చేసుకోవచ్చునేమో.

దేశ స్వాతంత్ర్యానికి పూర్వం ఈ రాజ్‌బన్షి తెగకు (లేక కులానికి) చెందిన రాజులు కూచ్‌బిహార్ అనే సంస్థానాన్ని ఏలేవారు. దాని పక్కనే ఉన్న బైకుంఠపూర్ అనే సంస్థానంతో కలుపుకుంటే మొత్తం ఉత్తర బెంగాల్ రాజ్‌బన్షిల దేశంగా ఉండింది. 1947 దాకా కూడా బ్రిటిష్ వారు ఈ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిపాలించలేదు. అయితే స్వాతంత్ర్యం తరువాత దీనిని పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కలిపేశారు.

స్వాతంత్ర్యం వచ్చిన తొలిదశలో భాష ప్రాతిపదికన రాష్ట్రాలను వర్గీకరించారు కాబట్టి ఇది పూర్తిగా కృత్రిమమయిన నిర్ణయమని అనలేము. రాజ్‌బన్షి ప్రజల భాష బెంగాలీకి బాగా సన్నిహితమైనది. అది వేరే భాష అని కాంటాపురీ ఉద్యమకారులు అంటుండగా, అది బెంగాలీకి ఒక మాండలికం మాత్రమేనని సగటు బెంగాలీలు అంటారు. 'వాళ్లు మాతో మాట్లాడినప్పుడు యాస సమస్య తప్ప వేరే సమస్య ఏమీ ఉండదుగానీ వారిలో వారు మాట్లాడేది మాకు అర్థం కావడం కొంచెం కష్టమే'నని బెంగాలీలలో కొంచెం ప్రజాస్వామిక దృష్టిగల వాళ్లు అంటారు.

'నిజంగా' వేరు భాషా కాదా అని తర్కించడం కంటే, భాషలోని ఈ తేడా ఏ చారిత్రక క్రమంలో తాము వేరన్న రాజ్‌బన్షీల భావనలో భాగమయిందో తెలుసుకోవడం ఎక్కువ ఉపయోగకరం. రాజ్‌బన్షీల జీవన సంస్కృతికీ రూపురేఖలకూ కూడా ఇది వర్తిస్తుంది. ఏ రెండు కులాల లేక తెగల సంస్కృతిలోనయినా సహజంగా ఉండే తేడాలను పక్కనపెడితే, వ్యవసాయకంగా వెనుకబడిన ప్రజల జీవన సంస్కృతికీ వ్యవసాయ ఆధునికత అలవరచుకున్న వారి సంస్కృతికీ మధ్యన ఉండే భేదాన్ని మించి రాజ్‌బన్షి-బెంగాలీ అనే సాంస్కృతిక భేదం ఉందా అంటే అనుమానమే.

అయితే కొన్ని చారిత్రక కారణాలు ఈ తేడాల ప్రాముఖ్యాన్ని పెంచాయి. ఇందులో ప్రధానమయినది తూర్పు బెంగాల్ నుంచి పెద్ద సంఖ్యలో రాజ్‌బన్షీల భూభాగానికి వచ్చిన బెంగాలీల వలస. ఈశాన్య భారతంలో అన్ని రాష్ట్రాలనూ ఈ వలస ప్రభావితం చేసింది. వలస వచ్చినవారు స్థానికుల కంటె వ్యవసాయకంగా అభివృద్ధి చెందినవారు, ఇంగ్లీష్ చదువు ఎక్కువ నేర్చినవారు కావడం వల్ల స్థానికుల ప్రయోజనాలను దెబ్బతీయగలిగారు.

ఉత్తర బెంగాల్‌కు తూర్పు బెంగాల్ (నేటి బంగ్లాదేశ్) నుంచి 1947లో ఒకసారి, 1952లో ఒకసారి, 1970లో ఒకసారి ప్రజలు పెద్ద సంఖ్యలో వలస వచ్చారు. రాజ్‌బన్షీలు ఈ కాందిశీకులను 'భాటియా'లు అంటారు. దీనిని భూస్వాముల వలస అంటే అతిశయోక్తి అవుతుందిగానీ తూర్పు బెంగాల్‌లోని హిందువులు స్థానిక ముస్లింల కంటే భూమి, సంపద, చదువు సాపేక్షంగా ఎక్కువ గలవారే. 1947 తరువాత తూర్పు బెంగాల్ నుంచి వలస వచ్చిన వారిలో పొట్టకూటి కోసం వచ్చిన ముస్లింలు సహితం ఉన్నారుగానీ ఎక్కువ శాతం వలస వచ్చింది హిందువులే. వారు వలస

వెళ్లిన ప్రాంతాల ప్రజలు వారికంటె విద్యా ఆర్థిక విషయాలలో వెనుకబడిన వారు కావడం వారికక్కడ స్థిరపడి బాగుపడడానికి అవకాశం కల్పించింది. అదే కారణంగా స్థానికులలో ఈ వలస వల్ల తమకు అన్యాయం జరిగిందన్న నిరసన చోటు చేసుకుంది. ఉత్తర బెంగాల్ అట్టి ప్రాంతాలలో ఒకటి.

బెంగాలీలలో ఈ నిరసనను సానుభూతితో అర్థం చేసుకున్నవారి సంఖ్యను వేళ్ల మీద లెక్కపెట్ట వచ్చు. 'రాజ్‌బన్షీలు తమ భూమిని భాటియాలకు స్వచ్ఛందంగానే అమ్మారు. వారినెవ్వరూ బలవం తం చేయలేదు. ఇప్పుడు మా భూమి అంతా పరాయివాళ్ల పాలయిపోయిందని గొడవ చేయడం ఏం న్యాయం?' అని సిపిఐ (ఎం) జల్పాయ్‌గుడి జిల్లా కార్యదర్శి మనీష్ సన్యాల్ అంటాడు. అతను స్వయంగా తూర్పు బెంగాల్ నుంచి వలస వచ్చిన 'భాటియా' కుటుంబానికి చెందినవాడు. ఉత్తర బెంగాల్‌లోని సిపిఐ (ఎం) నాయకులంతా భాటియాలేననేది రాజ్‌బన్షీల ఫిర్యాదులలో ఒకటి.

భూములు అమ్ముకొమ్మని రాజ్‌బన్షీలను ఎవ్వరూ బలవంతం చేయలేదు. ఉత్తర బెంగాల్‌లో వర్షపాతం సమృద్ధిగా ఉంటుంది కాబట్టి (మన రాష్ట్రంలోని అత్యధిక వర్షపాతానికి దాదాపు నాలుగు రెట్లు కురుస్తుందక్కడ) కరువు కాటకాల వల్ల భూములు అమ్ముకున్నారనడానికీ వీలులేదు. అయితే పెట్టుబడి, చదువు లోపించిన కారణంగా (చదువులో ఇప్పటికీ రాజ్‌బన్షీలు చాలా వెనుకబడి ఉన్నారని సిపిఐ (ఎం) నాయకులు సహితం ఒప్పుకుంటున్నారు) ఆ భూమిలో ప్రకృతి ఇచ్చే రాబడిని మించి పొందడానికి అవసరమైన ఆధునిక వ్యవసాయ పద్ధతులు రాజ్‌బన్షీలకు దూరం ఉండిపోయాయి. అందువల్ల వారి భూములు కొనుక్కొని వాటిపైన పెట్టుబడిపెట్టి సాంకేతిక అభి వృద్ధి సాధించడానికి సిద్ధంగా ఉన్న భాటియాలకు పెద్ద మొత్తంలోనే తమ భూములు అమ్ముకున్నారు. ఇప్పుడు తాము ఏం కోల్పోయామో గ్రహించడానికి కావలసిన జ్ఞానం వారు పొందారు. కానీ అది భూములు తిరిగి రాబట్టుకోవడానికి పనికిరాలేదు.

భూముల బదలాయింపు విషయంలో 'ఇందులో ఎవరి తప్పూ లేదు' అనడానికి అవకాశ మయినా ఉందేమోగానీ ఇతర విషయాలలో లేదు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రాజ్‌బన్షీలను ఎస్‌సిలుగా గుర్తించిందిగానీ వారి అభివృద్ధి కోసం ప్రత్యేకమైన కృషి ఏమీ చేయలేదు. విద్యా ఉద్యోగ రంగాలలో రాజ్‌బన్షీల భాగస్వామ్యం చాలా స్వల్పమని అధికారులు సహితం ఒప్పుకుంటు న్నారు. వామపక్ష పార్టీలు వలస వచ్చిన భాటియాల వోట్లు మీద ఆధారపడతాయి కాబట్టి వారి 'వోటు బ్యాంక్' రాజకీయం రాజ్‌బన్షీల పట్ల నిర్లక్ష్యంగా మారిందని కాంటాపురీ ఉద్యమకారుల వ్యాఖ్య.

కారణమేదయితేనేం, దాని పరిష్కారం కోసం 1979లోనే ఉత్తరబంగా తబ్సీలీ జాతీ ఆదివాసీ సంఘటన్ ('ఉబ్జాస్' అంటారు) అనే సంస్థ ఏర్పడింది. ఉత్తర బెంగాల్‌లోని ఎస్‌సి, ఎస్‌టిల బాగు కోసం కృషిచేయడం దీని లక్ష్యం. ఇక్కడ ఎస్‌సి అంటే ప్రధానంగా రాజ్‌బన్షీలు, ఎస్‌టిలు అంటే తేయాకు తోటలలో పనిచేయడానికోసం ఈనాటి జార్ఖండ్ నుంచి తీసుకురాబడిన సంతాల్ తదితర ఆదివాసీ తెగలు అని అర్థం. ఈ సంస్థ ప్రత్యేక రాష్ట్రం కావాలన్న డిమాండ్ పెట్టలేదు. జాతుల ప్రాతిపదికన సమస్యను వ్యాఖ్యానించలేదు. కాంగ్రెస్ వారికి కాకపోయినా కనీసం వామపక్ష పార్టీ లకు సులభంగా మింగుడు పడగల భాషలోనే మాట్లాడింది.

ఉబ్జాస్ తన లక్ష్యాన్ని కొంతమేరకయినా సాధించి ఉంటే ఏమయ్యేదో గానీ అది జరగలేదు.

1992లో అఖిల కాంటాపురి విద్యార్థి సంఘం (ఆక్సు) పుట్టింది. అప్పటివరకు ఉబ్జాస్‌లో పనిచేసిన రాజ్‌బన్షి యువత ఆక్సులోకి వచ్చారు. ఆక్సు కూడ తొలినాడు ప్రత్యేక రాష్ట్రం డిమాండు పెట్టలేదు. కాంటాపురి ప్రాంత భాషా సంస్కృతులను కాపాడడం తన ప్రధాన లక్ష్యంగా ప్రకటించుకుంది.

ప్రత్యేక రాష్ట్రం డిమాండు కాంటాపురి పీపుల్స్ పార్టీ (కెపిపి)తో ముందుకొచ్చింది. ఈ పార్టీ 1996 జనవరి 7న ఏర్పడింది. దాని అధ్యక్షుడు సిలిగురిలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న అతుల్ చంద్రరాయ్. అదే సంవత్సరం సెప్టెంబర్ 26న అతను భారత ప్రభుత్వానికి సమర్పించిన వినతి పత్రంలో తమ పార్టీ లక్ష్యాన్నీ, డిమాండ్లనూ వివరించాడు. ఉత్తర బెంగాల్ మూలవాసుల తరఫున కెపిపి మాట్లాడుతున్నదన్నాడు. వారు జనాభాలో 80 శాతం ఉన్నారన్నాడు. 'సాంస్కృతికంగా, భాషాపరంగా, చారిత్రకంగా, సాంఘికంగా' ఈ ప్రజలు బెంగాలీల కంటె భిన్నమైన వారన్నాడు. ఒకప్పుడు కూచ్‌బిహార్, వైకుంఠపూర్ రాజ్యాలలో ఉన్న ఈ ప్రజలను బలవంతంగా బెంగాల్‌తో కలిపేయడం జరిగిందన్నాడు.

పశ్చిమ బెంగాల్‌లో భాగం చేయబడ్డ ఉత్తర బెంగాల్ లేక కాంటాపూర్ 'ఉద్దేశ్యపూర్వకంగా వెనుకబాటుతనంలో ఉంచబడింది' అన్నాడు. ముడి సరుకులు ఇక్కడి నుంచి తీసుకొనిపోయి కలకత్తా నగరాన్నీ దాని పరిసరాలనూ పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నారన్నాడు. ఉత్తర బెంగాల్ లేక కాంటాపూర్‌లో లభ్యమయ్యే వెదురు, కలప, తేయాకు, జనపనార, పొగాకు, ఔషధ మొక్కలు, పండ్లు కలకత్తాకు ఎగుమతయిపోయి ఆ నగరం పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడుతున్నాయనీ ఈ ప్రాంతం మాత్రం వెనుకబడి ఉండిపోయిందనీ అన్నాడు. కాంటాపురి భాషా సంస్కృతులను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, భారత ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నాడు. తూర్పు బెంగాల్ (బంగ్లాదేశ్) నుంచి వచ్చిన, వస్తున్న వలస కారణంగా ఉత్తర బెంగాల్‌లోని మూలవాసులు మైనారిటీ అయిపోతున్నారనీ తమ ఉనికిని కోల్పోతున్నారనీ అన్నాడు. పశ్చిమ బెంగాల్ పాలకులు ఈ కాందిశీకుల వోట్ల మీద ఆధారపడుతున్నారు కాబట్టి వారి నుంచి స్థానికులను కాపాడే ప్రయత్నం చేయడం లేదన్నాడు.

జల్పాయ్‌గుడి, కూచ్‌బిహార్, మాల్డా, దక్షిణ దినాజ్‌పూర్, ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలనూ డార్జీలింగ్ జిల్లాలోని మైదాన ప్రాంతాన్నీ కలిపి కాంటాపూర్ రాష్ట్రంగా రూపొందించి ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలన్నది కెపిపి ప్రధానమైన డిమాండు కాగా, కాంటాపురి భాషను భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూలులో చేర్చాలని, కాంటాపురి ప్రాంతంలోకి ప్రవేశించడానికి బయటి వారెవ్వరైనా 'పర్మిట్' తీసుకోవాలన్న చట్టం చేయాలనీ, సిలిగురి ఆకాశవాణి కేంద్రం కాంటాపురి భాషలో కార్యక్రమాలు ప్రసారం చేయాలనీ, తియెస్తా నదిపైన తలపెట్టిన ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలనీ, కూచ్‌బిహార్‌లో ఒక విశ్వవిద్యాలయం నెలకొల్పాలనీ, 1971 ఇందిరా–ముజిబ్ ఒడంబడిక ప్రాతిపదికన బయటి వారినందరినీ గుర్తించి వెళ్లగొట్టాలనీ, కాంటాపురి ప్రజల ఆర్థిక సాంస్కృతిక స్థితిగతులపైన పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలనీ కూడా కెపిపి డిమాండ్ చేస్తున్నది.

కాంటాపురి ఉద్యమం కేవలం రాజ్‌బన్షిల ఉద్యమమా లేక 1947కు పూర్వం నుంచి ఉత్తర బెంగాల్‌లో ఉంటున్న బెంగాలీలు, ఇతర (ఆదివాసీ) ప్రజా సమూహాలు కూడా స్థానికుల కిందికే వస్తారా అన్న ప్రశ్నకు కెపిపి జల్పాయ్‌గుడి జిల్లా శాఖ అధ్యక్షురాలు మిటాలీరాయ్ స్పష్టంగానే

జవాబు చెప్తారు. 'ఇది రాజ్‌బన్షీలకూ బెంగాలీలకూ మధ్య ఘర్షణ కాదు. స్థానికులకూ బయటి వారికీ మధ్య ఘర్షణ' అని ఆమె స్పష్టం చేస్తున్నారు. ఈ స్థానికులలో పూర్వం నుంచి ఉంటున్న బెంగాలీలే కాక అనేక ఆదివాసీ తెగలు కూడా ఉన్నాయి. అయితే 'కాంటాపురి భాషా సంస్కృతులు' అన్నప్పుడు ప్రస్తావనకు వస్తున్నది రాజ్‌బన్షీ ప్రజల భాషా సంస్కృతులేననేది స్పష్టమే. ఉత్తర బెంగాల్‌లో 1947కు పూర్వం అత్యధిక జనాభా రాజ్‌బన్షీలేనని గుర్తుంచుకుంటే ఇక్కడ పెద్దగా వైరుధ్యం ఉండకపోవచ్చు. ఆర్థిక హక్కులు, భూమి హక్కు, ఉద్యోగ హక్కు మొదలయిన విషయాలలో కెపిపి 1947కు పూర్వం నుంచి ఉత్తర బెంగాల్‌లో ఉంటున్న వారందరినీ ఒకటిగా చూసినప్పటికీ 'భాషా సంస్కృతుల' విషయంలో మూలవాసులయిన రాజ్‌బన్షీల సంప్రదాయాన్నే కాంటాపురి అధికారిక సంప్రదాయంగా పరిగణించదలచుకుందని స్పష్టం అవుతుంది.

1947కు పూర్వం ఈ అయిదున్నర జిల్లాలలో రాజ్‌బన్షీల జనాభా ఎంత శాతం ఉండిందన్న విషయంలో కచ్చితమైన గణాంకాలు లేకపోయినప్పటికీ వారే మెజారిటీ అని సిపిఐ (ఎం) సహితం ఒప్పుకుంటుంది. కాంటాపురి ఉద్యమానికి కేంద్రమైన జల్పాయ్‌గుడి జిల్లాలో రాజ్‌బన్షీలు 75 శాతం ఉండేవారనీ, కూచ్‌బిహార్ జిల్లాలో 80 శాతం ఉండేవారనీ మిటాలిరాయ్ అంటారు. అది అతిశయోక్తి అని సిపిఐ (ఎం) నాయకులు అంటారు. అయితే వారి జనాభా ఆనాడు అక్కడ మెజారిటీ అనీ 1947, 1952, 1970 లలో వచ్చిన 'భాటియా'ల కారణంగా వారిప్పుడు మైనారిటీ అయిపోయారనీ అందరూ ఒప్పుకుంటారు.

మొదట్లో చెప్పినట్టు కెపిపి ఎన్నికలలో పాల్గొనే పార్టీ. గత పంచాయతీ ఎన్నికలలో ఉత్తర బెంగాల్‌లో 27 సర్పంచ్ పదవులు గెలుచుకున్నారు. అయితే పోలీసు నిర్బంధం కారణంగా ఆ పార్టీ ఉనికే ఇప్పుడు ప్రశ్నార్థకం అయింది. దీని వివరాలు దిగువన చూద్దాం.

కాంటాపురి డిమాండ్‌తో ఆయుధాలు పట్టుకున్న కెఎల్‌ఓ గురించి స్పష్టమైన సమాచారం లేదు. ఇది 1999లోనో, 2000 సంవత్సరంలోనో ఏర్పడింది. దీనికి అస్సాంలోని అల్ఫాతో సంబంధాలున్నాయని పోలీసుల కచ్చితమైన అభిప్రాయం. కెఎల్‌ఓ కార్యకర్తలు భూటాన్‌లో ఆయుధ శిక్షణ పొందుతున్నారనేది మరొక అభియోగం.

కెఎల్‌ఓ గురించి కచ్చితమైన సమాచారం లేకపోవడానికి కారణమేమిటంటే ఆ సంస్థ కరపత్రాలు గానీ, పోస్టర్లు గానీ ఏ రకమైన ప్రచురణలు గానీ చేపట్టదు. పత్రికా ప్రకటనలు సహితం ఇవ్వదు. బహుశా ఇంత పూర్తిగా 'రహస్యం'గా పనిచేసే సంస్థ ఇండియాలో వేరే ఏదీ లేదేమో! దీనిని నెలకొల్పింది ఎవరు, వారికి కెపిపితో గానీ, ఆక్సుతో గానీ ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే విషయాలు కూడా తెలీవు. వీరంతా ఒకటేనని ప్రభుత్వం సులభంగా కొట్టిపారేస్తుంది. కెఎల్‌ఓ పేరు చెప్పి అందరి మీదా నిర్బంధం ప్రయోగించడానికి ఆ ప్రకటన ప్రభుత్వానికి పనికొస్తుంది. అయితే రాజ్‌బన్షీలు ఈ విషయంలో ఏమీ చెప్పరు. కెఎల్‌ఓ అనే సంస్థ ఒకటి ఉందని తమకు తెలుసునుగానీ దాని గురించి అంతకంటే ఏమీ తెలీదంటారు.

## నిర్బంధం

ఒకే లక్ష్యం కోసం సాయుధ సంస్థలూ లీగల్ సంస్థలూ పనిచేస్తున్న చోట మొత్తంగా ఆ లక్ష్యాన్నే నిషిద్ధ లక్ష్యంగా పరిగణించి దానికోసం జరిగే సకల కార్యాచరణనూ టెర్రరిజంగా ప్రకటించి శిక్షించే ఆనవాయితీ పోలీసు వ్యవస్థలో దేశవ్యాప్తంగా ఉంది. వామపక్ష సంఘటన పరిపా

లిస్తున్న పశ్చిమ బెంగాల్ ఇందుకు మినహాయింపు కాదని కాంటాపురి పోరాటం చూపుతుంది.

పశ్చిమ బెంగాల్ పోలీసులు, కేంద్ర పారా మిలిటరీ కలిసి కాంటాపురి ఆపరేషన్–I, కాంటాపురి ఆపరేషన్–II, కాంటాపురి క్రాక్‌డవున్, ఆపరేషన్ షాడో అనే పేర్లతో నాలుగు దఫాలుగా కాంటాపురి ఉద్యమం పైన దాడులు నిర్వహించారు. నాలుగూ ముగిసేసరికి 800 మందిని అరెస్టు చేశారు. అందులో 350 మంది ఈ సంవత్సరం జనవరి నాటికి ఇంకా జైలులోనే ఉన్నారు. కెపిపి, ఆక్సు బాధ్యులు దాదాపు అందరూ జైలులో ఉన్నారు.

పోటా ప్రయోగించకుండానే ఇంతమందిని ఇంతకాలం జైలులో ఉంచడం పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఎట్లా సాధ్యం అయింది? ఐపిసిలోని అతి తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు బుక్ చేయడం, ఒకవేళ బెయిలు వస్తే వెంటనే కొత్త కేసు నమోదుచేసి తిరిగి రిమాండు చేయించడం అనే 'రెండంచెల వ్యూహం' ఈ ఫలితాన్ని ఇచ్చింది. భారత ప్రభుత్వం మీద యుద్ధం చేయడం (సెక్షన్ 121), దానికోసం కుట్ర చేయడం (121ఎ), దాని కోసం ఆయుధాలు సమీకరించడం (122), ఆ విషయాన్ని గోప్యంగా ఉంచడం (123), వెరసి రాజద్రోహానికి పాల్పడడం (124ఎ) అనే అభియోగాల మీద వారిని అరెస్టు చేస్తున్నారు. దేశం లోపల వేరే రాష్ట్రం కావాలని మాత్రమే కోరుతున్న ఉద్యమం ఒకవేళ తుపాకులు పట్టుకున్నా దాని మీద ఈ అభియోగాలు వేయడంలో ఏమాత్రం అర్థం లేదు. అంతేకాక కాంటాపురి ఉద్యమం చేపట్టిన హింసాత్మక చర్యలన్నిటినీ పోగు చేసినా అది ఏ అర్థంలోనూ 'యుద్ధం' అనిపించుకోదు.

మరి ఈ సెక్షన్ల కింద కేసులు ఎందుకు పెడుతున్నారంటే అవి రుజువవుతాయనీ శిక్ష పడుతుం దనీ కాదు. అవి చట్టం కళ్లలో చాలా తీవ్రమైన అభియోగాలు కాబట్టి బెయిల్ దొరకడం కష్టమవు తుందని. సెక్షన్ 121 కింద ఉరిశిక్ష కూడా వేయవచ్చు. మిగిలిన నేరాలకు పది సంవత్సరాల నుంచి జీవితఖైదు దాకా విధించవచ్చు. అందువల్ల ఈ సెక్షన్ల కింద కేసు కడితే కోర్టులు సులభంగా బెయిలు ఇవ్వవు.

అయినప్పటికీ ఏదో ఒక రోజు బెయిలు రావచ్చు. కాబట్టి పోలీసులు ఏం చేస్తున్నారంటే ఒక్కొక్కరినీ అయిదు పది కేసులలో ముద్దాయిలుగా చూపించి ఒక కేసులో బెయిలు వచ్చేదాకా ఆగి, బెయిలు రాగానే మరొక కేసులో రిమాండు తీసుకుంటున్నారు. ఒక్కొక్కసారి ఇంకా జైలు నుంచి బయటకు రాకముందే రిమాండు తీసుకుంటున్నారు. ఒక్కొక్కసారి బయటకు రానిచ్చి గేటు దగ్గర అరెస్టు చేస్తున్నారు.

జల్పాయ్‌గుడి జిల్లా బడాదల్దలీకి చెందిన నిర్మల్‌దాస్‌ను 1999 సెప్టెంబర్ 24న అరెస్టు చేశారు. కాంటాపురి ఉద్యమంలో ఇదే మొదటి అరెస్టు. 90 రోజుల తరువాత చార్జిషీటు దాఖలు చేయని కారణంగా కోర్టు అతనిని బెయిలుపైన విడుదల చేయగా గేటు దగ్గరే తిరిగి అరెస్టుచేసి మళ్లీ లోపల వేశారు. ఈ విధంగా తొమ్మిదిసార్లు జరిగిన తరువాత అతను 2002 మే 19వ తేదీన బయటికి వచ్చాడు. అతనికి ఏ ఒక్క కేసులోనూ శిక్ష పడలేదు. అసలు విచారణే జరగలేదు. కేవ లం రిమాండు ఖైదీగా ఒక సంవత్సరం 8 నెలలు జైలులో ఉన్నాడు. పోలీసులు అతనిపైన పోటా ప్రయోగించినా జాతీయ భద్రతా చట్టం ప్రయోగించినా ఇంతకంటె ఎక్కువ 'ప్రయోజనం' కలిగేది కాదు. 'నల్ల చట్టాలను' ప్రయోగించిన అప్రతిష్ఠ మాత్రం పశ్చిమ బెంగాల్ వామపక్ష ప్రభుత్వానికి దక్కేది.

నిర్మల్‌దాస్‌తో మొదలయిన దుష్ట ప్రక్రియను ఆ తరువాత చాలామంది కాంటాపురీ ఉద్యమ కారులపైన పోలీసులు ప్రయోగించారు. అయితే వారిలో కొందరు ఈ విషయాన్ని కలకత్తా హైకోర్టు దృష్టికి తీసుకుపోగా హైకోర్టు 2001 సెప్టెంబర్ 10న పోలీసులకు చీవాట్లు పెట్టింది.

'మేము బెయిలుపైన విడుదల చేసిన వారిని జైలు గేటు బయటే అరెస్టుచేసి మా ఆర్డర్లను వమ్ముచేయాలని చూడడం సహించరాని విషయం' అనింది.

'ఈ ముద్దాయిలను ఇప్పటికే ఇంకా ఏయే కేసులలో అనుమానితులుగా చూపించారో, లేక వారు కావాలని గుర్తించారో, భవిష్యత్తులో వారిని ఏ కేసులలో అరెస్టు చేసే అవకాశం ఉందో లేక వారి అవసరం ఉండగలదో, ఆ కేసులన్నిటి జాబితా మాకు సమర్పించవలసిందిగా బరువెక్కిన గుండెతో ఆదేశిస్తున్నాం'

అనింది కూడా. పశ్చిమ బెంగాల్ పోలీసుల ప్రవర్తన దీనితో మారలేదు. హైకోర్టు ఆదేశంపైన సుప్రీంకోర్టులో స్టే తెచ్చుకొని ఎప్పటిలాగే వ్యవహరిస్తున్నారు.

జల్పాయ్‌గుడి జిల్లా దఖిన్‌పుఖ్రిగ్రాం నివాసి అయిన ఆక్సు వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌దాస్ ఇప్పటికి ఆరుసార్లు బెయిలు పొంది ఆరుసార్లు వెంటనే మళ్లీ రిమాండ్ అయి రెండేళ్లుగా జైలులో ఉన్నాడు.

అదే జిల్లా కుమార్‌గ్రాం పోలీస్ స్టేషన్ పరిధిలోని చంగ్‌మారి నివాసి అయిన నుర్మాదాస్ నాలుగుసార్లు బెయిలు పొంది నాలుగుసార్లూ వెనువెంటనే రిమాండయి జైలులోనే ఉన్నాడు.

ఇది చూసి వేరేవాళ్లు బెయిల్ కోసం అర్జీ పెట్టుకోవడమే మానేశారు. శ్రీనివాస్ దాస్ స్వగ్రామ మయిన దఖిన్‌పుఖ్రిగ్రాం నివాసులు మరొక నలుగురు అతని గతి చూసి బెయిల్ కోసం ప్రయత్నమే చేయకుండా ఉండిపోయారు. వెరసి జల్పాయ్‌గుడి, ఆలీపూర్‌ద్వార్, కూచ్‌బిహార్, తూఫాన్‌గంజ్, మాతాభంగా జైళ్లలో బెయిలు పొందినవారూ, పొందనివారూ ఒక 350 మంది దీర్ఘ నిర్బంధంలో ఉన్నారు. 350 మందిని పోటా కిందనయినా, నాసా కిందనయినా అరెస్టుచేసి దీర్ఘ నిర్బంధంలో పెట్టి ఉంటే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి చాలా చెడ్డపేరు వచ్చి ఉండేది. ఆ బెడద లేకుండా 'సాధారణ చట్టాల'తోనే ఆ ఫలితాన్ని పశ్చిమ బెంగాల్ పోలీసులు సాధించిపెట్టారు.

ఒకే వ్యక్తి మీద పదే పదే కేసులు పెట్టడానికి అన్ని కేసులు పోలీసులకెక్కడ దొరుకుతున్నాయా అని ఆశ్చర్యపోతున్నారేమో. బహుశా కాంటాపూర్ ఉద్యమం చాలా హింసాత్మక ఘటనలకు పాల్పడు తుండవచ్చు ననుకుంటున్నారేమో. కాంటాపూర్ ఉద్యమం హింస చేయకపోలేదుగానీ ఒక్కొక్కరి మీదా ఏడెనిమిది కేసులు పెట్టేటన్ని ఘటనలేం జరగడం లేదు. మరి అన్ని కేసులెక్కడి నుంచి వచ్చాయి?

ఒకే ఒక రాత్రి – 2000 సంవత్సరం నవంబర్ 27 రాత్రి – పోలీసులు ఉత్తర బెంగాల్‌లోని భిన్న పోలీస్ స్టేషన్లలో కాంటాపూర్ ఉద్యమకారులపైన 39 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. ఇవన్నీ కుట్రకేసులే. ఒక్కొక్క కేసులోనూ డజన్ల సంఖ్యలో ముద్దాయిలను చూపించారు. భారత ప్రభుత్వంతో యుద్ధం చేసే లక్ష్యంతో వారందరూ ఎక్కడెక్కడో కలుసుకొని కుట్రలు చేశారని ఆ ఎఫ్‌ఐఆర్‌లు చెప్తాయి. అవన్నీ ఆ రాత్రే పోలీసుల పరిశోధనలో బయటపడ్డాయని చెప్తాయి. నిర్దిష్టమయిన నేరా రోపణలతో అరెస్టయిన వారిని పదే పదే అరెస్టు చేయడానికి ఈ 39 ఎఫ్‌ఐఆర్‌లు అక్కరకొచ్చాయి.

ఈ రకమైన నిర్బంధం ఫలితం కేవలం అరెస్టయిన వ్యక్తుల స్వేచ్ఛను హరించడం మాత్రమే

కాదు. వారి రాజకీయ అభిప్రాయాలకూ ఆకాంక్షలకూ అది ఉనికే లేకుండా చేస్తుంది. ఆక్సు, కెపిపిలు ఇప్పుడు కాగితం మీద మాత్రమే ఉన్నాయి. ఆక్సు కార్యవర్గమంతా జైలులో ఉన్నారు. కెపిపి ముఖ్యులలో అధ్యక్షుడు అతుల్ చంద్రరాయ్, జల్పాయ్‌గుడి జిల్లా కమిటీ అధ్యక్షురాలు మిటాలిరాయ్ మాత్రమే బయట ఉన్నారు. తక్కినవారంతా కటకటాల వెనుక ఉన్నారు. కాంటాపురి ఉద్యమానికి ప్రధాన కేంద్రం జల్పాయ్‌గుడి జిల్లా కాగా, ఆ జిల్లా కెపిపి శాఖ కార్యవర్గంలో అధ్యక్షు రాలు తప్ప అందరూ జైలులో ఉన్నారు. ప్రధాన కార్యదర్శి ధీరేంద్రనాథ్‌రాయ్ నాలుగుసార్లు బెయిలు తీసుకోగా నాలుగుసార్లు కొత్త కేసులు చూపించి అతనిని లోపల వేశారు. మధ్య మధ్యలో పోలీసుల కస్టడీలో ఉన్న కొద్దిసేపు కెపిపికి రాజీనామా చేసి సిపిఐ (ఎం)లో గానీ ఆర్ఎస్‌పిలో గానీ చేరమని అతనిపైన ఒత్తిడి పెడుతున్నారు.

సారాంశంలో, కాంటాపురీ ఉద్యమం లేవదీసిన ఏ ప్రశ్నకూ జవాబు చెప్పకుండానే కేవలం క్రిమినల్ చట్టం సహాయంతో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆ ఉద్యమ సంస్థలన్నిటి గొంతూ నొక్కే సింది. పనిలో పనిగా, 'ఈ ఉద్యమాలెందుకు? అధికార పక్షంలో చేరరాదా' అని వామపక్ష ప్రభుత్వం పోలీసులు ఆ ఉద్యమకారులపైన ఒత్తిడి పెడుతున్నారు కూడా.

కాంటాపురీ ఉద్యమం సిపిఐ (ఎం) నుంచి ప్రధానంగా రాజకీయ వ్యతిరేకత ఎదుర్కుంటున్నది. ఘర్షణ కూడా సిపిఐ (ఎం)తోనే ఎక్కువ ఉంది. కెఎల్ఓ ఏర్పడిన తరువాత వారి తుపాకులకు గురయింది కూడా ప్రధానంగా సిపిఐ (ఎం) వారే. అయితే మన దగ్గర జరిగినట్టే, కాంటాపురీ ఉద్యమకారులు సిపిఐ (ఎం) కార్యకర్తలపైన దాడిచేసినప్పుడల్లా పోలీసులు రంగంలోకి దిగి పాలక పార్టీ అయిన సిపిఐ (ఎం) తరఫున ప్రతీకారం తీర్చుకున్నారు. 2000 సంవత్సరం సెప్టెంబర్ నెలలో కాంటాపురి ఉద్యమకారులు జల్పాయ్‌గుడి జిల్లాలోని ధూప్‌గుడిలో ఇద్దరు సిపిఐ (ఎం) కార్యకర్తలను చంపారు. వెంటనే పోలీసులు ధూప్‌గుడికి చెందిన బారిపదరాయ్, కొయ్‌లాన్‌రాయ్ అనే రాజ్‌బన్షీలను ఎత్తుకుపోయి కూచ్‌బిహార్ జిల్లా మాతాభంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్టోలి గ్రామం దగ్గర కాల్చి చంపి 'ఎన్‌కౌంటర్' జరిగిందన్నారు.

ఇటువంటి పరోక్ష ప్రతీకారంతో సంబంధంలేని 'ఎన్‌కౌంటర్'లు కూడా జరిగాయి. 2000 సంవత్సరం డిసెంబర్ నెలలో నబ్లూదాస్, కందూరదాస్, జితేందర్‌దాస్ అనే ముగ్గురు రాజ్‌బన్షి యువకుల శవాలు భూటాన్ సరిహద్దు దగ్గర దొరికాయి. అవి బుల్లెట్లతో నిండి ఉన్నాయి. 'కెఎల్ఓ' లోని అంతర్గత కలహాలలో వారు చనిపోయారని ఆలీపూర్‌ద్వార్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ప్రకటించాడు గానీ ఆ ముగ్గురినీ పోలీసులు కుమార్‌గ్రాం పోలీస్ స్టేషన్‌కు పిలిపించారనీ ఆ తరు వాత వారు కనిపించలేదనీ కెపిపి నాయకులంటారు.

2002 వచ్చేసరికి ఎన్‌కౌంటర్ల సంఖ్య పెరిగింది. ఆ సంవత్సరం పదిమంది ఎన్‌కౌంటర్‌లలో చనిపోయారు. మనబోటి రాష్ట్రాలతో పోలిస్తే ఇది చిన్న సంఖ్యే కావచ్చునుగానీ తాము ప్రతిపక్షంలో ఉన్న రాష్ట్రాలలో 'ఎన్‌కౌంటర్ల'ను ఖండించడం సిపిఐ (ఎం) ఒక విధానంగా అలవరచుకున్న తరువాత కూడ వారి పాలనలోని రాష్ట్రంలో పోలీసులు అదేరకమైన హత్యాకాండకు పాల్పడడాన్ని ఏమనాలి?

మొత్తంగానే కాంటాపురీ ఉద్యమం విషయంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇతర ప్రభుత్వాల కంటే ఏమాత్రం భిన్నంగా వ్యవహరించడం లేదు. ఆ ఉద్యమం న్యాయమయిన సమస్యలను

లేవనెత్తుతున్నదని ఒప్పుకోవడంలేదు. ఆ ఉద్యమం వామపక్ష ప్రభుత్వాలు అమలుచేసిన భూ సంస్కరణల వల్ల భూములు కోల్పోయిన రాజ్‌బన్షి జోతేదార్ల కుట్ర అనేది సిపిఐ (ఎం) వ్యాఖ్య. బెంగాలీ కాందిశీకుల చేతిలోకి తమ భూములు పోవడం రాజ్‌బన్షీలకు మనస్తాపం కలిగించిందని సిపిఐ (ఎం) నాయకులు ఒప్పుకోరు. ఒళ్లు వంచకుండా జల్సాగా తిరిగే సంస్కృతిగల రాజ్‌బన్షీలు సాగుచేయడం ఇష్టం లేక తమ భూములు బెంగాలీలకు అమ్ముకున్నారనీ ఇప్పుడు ఏదో ఒక పేరు చెప్పి ఆ భూములను తిరిగి పొందాలని చూస్తున్నారనీ వారి వ్యాఖ్య. వలస వచ్చిన బెంగాలీలదే ఉత్తర బెంగాల్‌లో పైచేయి కావడం స్థానికులలో నిరసనకు దారితీసిందని ఒప్పుకోరు. బెంగాలీలు కష్టపడి పైకి వచ్చారు తప్ప ఒకరిని దోచుకోలేదే అంటారు. కెఎల్‌ఓ చేతిలోని తుపాకుల వెనుక న్యాయమైన ఆకాంక్షలున్నాయని ఒప్పుకోరు. వామపక్ష సంఘటన ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టి రాజ్‌బన్షీ - బెంగాలీ అనే జాతి విభజన రెచ్చగొట్టి సంకుచిత ప్రయోజనాలు పొందాలని చూసే తిరోగామిశక్తుల హింసోన్మాదం తప్ప అందులో వేరే ఏమీ లేదంటారు.

ఈ వైఖరి అన్యాయమయినదే కాక నిరర్థకం కూడానన్న అవగాహన మన దేశ పాలకులకు ఎప్పటికీ రాదేమో. 50 ఏళ్ల కింద నాగాలాండ్ ఉద్యమంతో మొదలుపెట్టి కాంటాపురి ఉద్యమం వరకు అన్ని జాతి ఉద్యమాల పట్ల అన్ని పార్టీలూ ఇదే వైఖరి అనుసరించాయి. ప్రజలను పదే పదే హింసించడానికి తప్ప ఇది ఇంకెందుకూ పనికిరాలేదు, పనికిరాదు.

**-నిజనిర్ధారణ కమిటీ నివేదిక**